

అత్యవసర సమయాల్లో అండగా..
- విపత్తులను ఎదుర్కొనేందుకు 'ఆపద మిత్ర'ల నియామకం
- జిల్లాలో 300 మంది వలంటీర్ల ఎంపిక
- మొదటి దశలో 59 మందికి, 12 రోజులు శిక్షణ

6

ప్రమాదకరంగా వంతెనలు
- పెరిగిన వాహనాల రాకపోకలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

6

ఆయిల్ పామ్‌తో అధిక ఆదాయం



- అంతర పంటలుగా కోకో, వక్క జాజికాయ, జాపత్రికి అవకాశం
- జిల్లాలో సాగు లక్ష్యం 18వేల ఎకరాలు
- మూడేళ్లలో సాగు చేసింది రెండు వేల ఎకరాలు
- 50 ఎకరాల్లో నర్సరీని సిద్ధం చేసిన లోహియా కంపెనీ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వాణిజ్య పంటగా ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుంది. పెట్టుబడి తక్కువగా ఉంటుంది. ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తోంది. అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చు. ఇన్ని అనుకూలతలు ఉన్నా.. అవగాహన కల్పించేవారు లేక జిల్లా రైతాంగం సాంప్రదాయ వరిసాగు పైనే మక్కువ చూపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించి దానిని ప్రోత్సహించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నది. సాగును చేపట్టే రైతులకు ఎకరాకు అన్నిరకాలుగా 50 వేల రూపాయల సబ్సిడీ అందేలా పథకాన్ని రూపొందించింది.

లక్ష్యానికి దూరంగా..

జిల్లావ్యాప్తంగా మూడేళ్లలో 18 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని నిర్ణయించింది. రైతులకు ఆయిల్‌పామ్ మొక్కల సరఫరా చేయడమే కాకుండా ఉద్యానవనశాఖతో కలిసి అవసరమైన సలహాలు, సూచనలు అందించేలా చర్యలు తీసుకున్నది. లోహియా ఎడిబుల్ ఆయిల్స్ లిమిటెడ్ కంపెనీకి కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంతోపాటు ఇక్కడ ఉత్పత్తి అయిన ఆయిల్ పామ్ గెలలను రైతుల నుంచి కొనుగోలు చేసి స్థానికంగానే వాటి క్రషింగ్ కోసం యూనిట్‌ను ఏర్పాటు చేసే బాధ్యతను అప్పగించింది.

జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంత్‌రావుపేటలో 30 ఎకరాల్లో లోహియా కంపెనీ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని 200 నుంచి 250 కోట్లతో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతోంది. 2026 మార్చి వరకు ఈ కంపెనీ అందు బాటులోకి వస్తుంది. లోహియా కంపెనీ చిగురుమామిడి మండల కేంద్రంలో 50 ఎకరాల భూమిని లీజుకు తీసుకొని నర్సరీ అభివృద్ధి చేసింది. ప్రస్తుతం రైతులకు సరఫరా చేసిన మొక్కలు పోనూ మూడు లక్షల ఆయిల్ పామ్ మొక్కలు ఈ నర్సరీలో ఉన్నాయి. 2022-23 నుంచి జిల్లాలో ఉద్యాన వనశాఖ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నది. 18 వేల ఎకరాల సాగు లక్ష్యంతో చేపట్టిన ఈ పథకంలో మొదటి సంవత్సరం జిల్లాలో 199 మంది రైతులు 608.84 ఎకరాల్లో ఈ సాగును చేపట్టారు. 2023-24లో 429 మంది రైతులు 1133.68 ఎకరాల్లో, 2024-25లో ఇప్పటి వరకు 144 మంది రైతులు 336.125 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును చేపట్టారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలు

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు మొదటి నాలుగు సంవత్సరాలకు ఒక్కో ఎకరానికి అంతర్‌పంటల సాగుకు, కలుపు తీయడం, తదితర నిర్వహణ కోసం 4,200 రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నది. మార్కెట్‌లో 193 రూపాయలున్న మొక్కను 20 రూపాయల సబ్సిడీ ధరపై రైతులకు సమకూరుస్తున్నది. నర్సరీని నిర్వహిస్తున్న కంపెనీకి మిగితా సొమ్మును ప్రభుత్వం చెల్లిస్తున్నది. డ్రిప్ కోసం అవసరమయ్యే మొత్తంలో ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతర వర్గాలకు 80 శాతం సబ్సిడీగా అందిస్తున్నది. సగటున ప్రభుత్వం ఒక్కో ఎకరాపై 50 వేల రూపా యలకుపైగా భరిస్తున్నది.

రైతులు ఈ సాగును చేపట్టడానికి మొదటి సంవత్సరం మొక్కలు పెట్టడానికి వీలుగా గుంతలు తవ్వుకోవడం, డ్రిప్ ఏర్పాటు చేసు కోవడానికి అవసరమైన ఖర్చులు ఎకరాకు 10 వేల వరకు భరిస్తే సరిపోతుంది. 30 సంవత్సరాల పాటు ఆయిల్ పామ్ మొక్కలు దిగుబడి ఇస్తాయి. నాలుగో సంవత్సరం నుంచి రైతుకు పంట చేతికి వస్తుంది. మొదటి నాలుగు సంవత్సరాల వరకు ప్రభుత్వమే నిర్వహణ ఖర్చులు భరిస్తున్న నేపథ్యంలో రైతులు పెట్టుబడి పెట్టాల్సిన అవసరమే లేదు. మొదటి మూడు సంవత్సరాలు మొక్కజొన్న, పత్తి, వేరుశనగ లాంటి పంటలను

మిగతా 8వ పేజీలో

జిల్లా నేలలు ఆయిల్ పామ్ సాగుకు యోగ్యం

ఆర్.శ్రీనివాస్‌రావు, ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్



నేలలు, వాతావరణం ఆయిల్‌పామ్ సాగుకు అన్ని రకాలుగా యోగ్యంగా ఉన్నాయి. దిగుబడి ఎక్కు వగానే వచ్చే అవకాశమున్నది. ఆయిల్ పామ్ సాగు ను కేవలం ఆ పంటకు పరిమితమైన సాగుగానే చూడవద్దు. సాంప్రదాయ పంటలే కాకుండా వాణిజ్య పరంగా అధిక లాభాలనిచ్చే పలు అంతర్‌పంటలను వేసే అవకాశమున్నది. ఆయిల్ పామ్ తోటల్లో కోకో, వక్క, జాజికాయ, జాపత్రి తదితర వాణిజ్యపంటలను సాగు చేయవచ్చు. పక్క రాష్ట్రాల్లో ఇప్పటికే కోకో, వక్క సాగు చేస్తున్నారు. జాజికాయ, జాపత్రి మొక్క లను కూడా సాగు చేయవచ్చు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నాము. ఈ జిల్లాలో సాగు చేసిన మొదటి సంవత్సరపు రైతులకు మరో సంవత్సరం గడిస్తే పంట చేతికి వచ్చి వారి దిగుబడి ఇతరులకు ప్రో త్సాహకరంగా మారుతుంది. ఆ తర్వాత సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయి. పంట చేతికి రాగా నే ఆ గెలలను కొనేందుకు లోహియా కంపెనీ సిద్ధంగా ఉన్నది.

జిల్లాలో ఆయిల్ పామ్ సాగు వివరాలు

సంవత్సరం	రైతులు	ఎకరాలు
2022-23	199	608.84
2023-24	429	1133.68
2024-25	144	336.125

(డిసెంబరు వరకు)

రైతులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలు

- మొదటి నాలుగు సంవత్సరాలు ప్రతి సంవత్సరం నిర్వహణ ఖర్చుల కింద ఎకరానికి రూ. 4,200
- రూ. 193 ధర ఉన్న మొక్కను రూ. 20కి అందజేత.. ఒక్కో మొక్కపై రూ. 173 సబ్సిడీ
- డ్రిప్ పరికరాలపై ఎస్సీ ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీ

అంతర పంటలతో అదనపు ఆదాయం

తెలుగు రాష్ట్రాల్లో ఆయిల్‌పామ్‌లో అంతరపంటగా కోకో సాగు చేస్తారు. కోకోతోపాటు వక్క (పోకలు), జాజికాయ, జాపత్రి సాగు చేసేందుకు అవకాశాలున్నాయి. ప్రస్తుతం కోకోను పండించే రైతులకు తెలుగు రాష్ట్రాల్లో ఎకరాకు 150 నుంచి 200 కేజీల గింజల దిగుబడి వస్తున్నది. కోకో మొక్కలను సరఫరా చేసే చాక్‌లెట్ కంపెనీలు ఆ గింజలను కొనుగోలు చేస్తాయి. గింజల నాణ్యతను బట్టి కేజీకి వెయ్యి రూపాయల ధర పలుకుతున్నది. కనీసం కేజీకి 600 రూపాయల ధర పలికినా రైతుకు ఎకరాకు 90 వేల నుంచి లక్ష రూపాయల ఆదాయం కోకో అంతర్‌పంట ద్వారా సమకూరే అవకాశమున్నది. వక్క (పోకలు) మొక్కలు సాగు చేస్తే ఎకరాకు లక్ష నుంచి లక్షన్నర రూపాయల ఆదాయం వచ్చే అవకాశమున్నది. కేరళ రిసర్చ్ సెంటర్ ద్వారా విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. అంతర ఎంటగా జాజికాయ, జాపత్రిని పండించే అవకాశాలు ఉన్నాయని, వీటిని సాగు చేస్తే ఎకరాకు 5 లక్షల రూపాయల మేరకు కూడా ఆదాయం సమకూరే అవకాశాలున్నట్లు తెలుస్తున్నది. వందేళ్ల వరకు జాజికాయ మొక్కలు దిగుబడి ఇస్తాయని సమాచారం. అంతర పంటగా వాణిజ్య పంటలైన కోకో, వక్క, జాజికాయ, జాపత్రిలను సాగు చేస్తే ఆయిల్ పామ్ కంటే అధిక ఆదాయం సాధించవచ్చని అధ్యయనాలు తెలుపుతున్నాయి.



సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

కలెక్టర్ పమేలా సత్పతి



గోపాల్‌రావుపేటలో అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

రామడుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల ఎంపిక సర్వే పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. మండలంలోని వెదిర , గోపాల్‌రావుపేట గ్రామాల్లో జరుగుతున్న సర్వేను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా సర్వే వివరాలు నమోదు చేయాలన్నారు. రేషన్ కార్డుల జారీకి సంబంధించి కుటుంబ ఆర్థిక స్థితిగతులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రైతు భరోసా కింద సాగు భూముల వివరాలనే నమోదు చేయాలన్నారు. నిర్మాణాలు ఉన్న స్థలాలు, కోళ్ల ఫామ్‌లు, రైస్ మిల్లులు స్థలాల వివరాలు నమోదు చేయ వద్దన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద 2023-24లో కనీసం 20 రోజుల ఉపాధి పని చేసిన భూమి లేని కూలీలనే ఎంపిక చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, చొప్పదండి ఏడీఏ ప్రియదర్శి ని, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వరి, ఏవో త్రివేదిక పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్



వాహనదారులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్

కరీంనగర్ క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ఆర్టీఏ నియమ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు పడాల రాహుల్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా తిమ్మాపూర్‌లోని ఆర్టీవో కార్యాలయంలోని ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో రాహుల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పడాల రాహుల్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వాలు అవగాహన కల్పిస్తాయని, వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అనంతరం వాహనదారులతో రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ హరిత, రిటైర్డ్ డీటీఓ జైపాల్ (ట్రైనింగ్) పాల్గొన్నారు.

నిధుల కోసం పోరాడుతాం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కార్పొరేటర్ మర్రి భావన

కరీంనగర్ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసేంత వరకు పోరాడతామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. నగరంలోని 32వ డివిజన్‌లో 45 లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. స్మార్ట్‌సిటీ, పట్టణ ప్రగతి, సీఎం హామీ నిధులతో కరీంనగర్ బీఆర్‌ఎస్ పాలనలో సుందరంగా అభివృద్ధి చెందిందన్నారు. నగరపాలక సంస్థపై ఆర్థికభారం పడకుండా ప్రతి సంవత్సరం గత ప్రభుత్వం 100 కోట్ల చొప్పున 350 కోట్లను మంజూరు చేసిందని చెప్పారు. గతంలో కేటాయించిన 85 కోట్ల సీఎం హామీ నిధుల పనులను ఇప్పటి వరకు ప్రారంభించక పోవడం శోచనీయమన్నారు. మానేరు రివర్ ఫ్రంట్‌ను పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్ మర్రి భావన, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు జంగిలి ఐలేందర్‌యాదవ్, తోట రాములు, దిండిగాల మహేశ్, జంగిలి సాగర్, నాంపల్లి శ్రీనివాస్, బోనాల శ్రీకాంత్, కచ్చు రవి, నాయకులు గందె మహేశ్, కోల సంపత్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

23న పద్మనగర్ సమీకృత మార్కెట్ ప్రారంభం

- అదే రోజు స్టాల్స్ అప్పగిస్తాం
- పారదర్శకంగా దుకాణాల కేటాయింపు
- మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పద్మనగర్‌లో అత్యాధునిక హంగులతో నిర్మించిన సమీకృత మార్కెట్ (ఇంటిగ్రేటెడ్ మార్కెట్)ను ఈనెల 23న ప్రారంభిస్తామని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. అదే రోజు డ్రాలో దక్కించుకున్న వ్యాపారులకు స్టాల్స్‌ను కేటాయిస్తామన్నారు. సోమవారం కళాభారతి ఆడిటోరియంలో పద్మనగర్ సమీకృత మార్కెట్‌లోని 193 స్టాల్స్, షెట్టర్లను వ్యాపారులకు కేటాయించేందుకు డ్రా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ యాదగిరి సునీల్‌రావు హాజరై డ్రా తీసి స్టాల్స్ నంబర్లు, వ్యాపారుల పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రిజర్వేషన్ కేటగిరీ ప్రకారంగా 193 దుకాణాలకు లక్కీ డ్రా నిర్వహించి పారదర్శకంగా కేటాయించామని చెప్పారు. 114 కూరగాయలు, 12 పండ్లు, 12 పూలు, 26 మాంసం స్టాల్స్‌తో పాటు 12 ఇతర వ్యాపారులకు కేటాయించామని చెప్పారు.

కేటాయించిన స్టాల్స్‌ను పొందిన వ్యాపారులు మూడు నెలల అద్దెలను అడ్వాన్స్‌గా చెల్లించి ఐదు సంవత్సరాలు అగ్రి మెంట్ చేసుకోవాలని సూచించారు. అగ్రిమెంట్ చేసుకోకపోతే వారికి కేటాయించిన దుకాణాన్ని రద్దు చేసి వేరొకరికి కేటాయిస్తామన్నారు. స్టాల్స్ పొందిన వ్యాపారులు ఇతరులకు దుకాణాలను అప్పగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, ఆర్వో సునీల్, ఆర్ఐ శ్యాం పాల్గొన్నారు.



డ్రా నిర్వహిస్తున్న కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, మేయర్ సునీల్‌రావు

సీపీఐది త్యాగాలు, పోరాటాల చరిత్ర

జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సీపీఐది త్యాగాలు, పోరాటాల చరిత్ర అని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం చిగురుమామిడి మండల కేంద్రంలో భారత కమ్యునిస్టు పార్టీ వంద సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా ఎర్ర జెండాలతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించి ఎర్ర జెండా ఎగురవేసేందుకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. చిగురుమామిడి మండలం కమ్యూనిస్టు పార్టీకి కంచుకోటగా ఉందన్నారు. సీపీఐ జిల్లాకార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ సీపీఐని గ్రామాల్లో బలోపేతం చేసి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్నస్వామి, చాడ శ్రీధర్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

లబ్ధిదారుల ఎంపికకు వార్డు సభలు



- నేడు 30 డివిజన్లలో, రేపు 30 డివిజన్లలో
- రేషన్‌కార్డుల సర్వేపై గందరగోళం
- కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం ప్రకటన

కరీంనగర్ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమల్లోకి తేనున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు నగరపాలక సంస్థ రెండు రోజులపాటు వార్డు సభలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. నగరంలోని 60 డివిజన్లలో మంగళవారం 30 డివిజన్లు, బుధవారం 30 డివిజన్లలో వార్డు సభలను వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు 15 డివిజన్లలో, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు మరో 15 డివిజన్లలో ఈ వార్డు సభలను నిర్వహిస్తారు. వార్డు సభలను నిర్వహించి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్న వారు, ఇటీవల నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను సభల్లో వెల్లడించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపడతారు.

రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై ప్రజల్లో తీవ్ర గందరగోళం నెల కొన్నది. చాలా మంది ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా వారి పేర్లు జాబితాలో లేవంటూ సర్వే చేయలేదు. కొంత మందిదరఖాస్తు చేసుకోకపోయినా వారి పేర్లను సర్వే జాబితాలో చేర్చారు. కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు, ఉపాధ్యాయుల పేర్లుకూడా సర్వే జాబితాలో ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. చాలా మంది అర్హులైన వారు ప్రజాపాలనలో, సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలోనే కాకుండా కలెక్టర్ నిర్వహించిన ప్రజావాణిలో ఇందిరమ్మఇళ్లు, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికి ఇటీవల నిర్వహించిన సర్వేలో వారి పేర్లు లేవని ఆందోళన చెందుతున్నారు. సర్వే చేయని వారికి ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తారో లేరోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని ప్రకటించింది. దీంతో వార్డు సభల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు చాలామంది సిద్ధమవుతున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి



లింగన్న(ఫైల్)

ఇబ్రహీంపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన పిట్లం లింగన్న (41) అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు. లింగన్న ఈ నెల 14న ఇంట్లో నుంచి వెళ్లి మరునాడు వ్యవసాయ తోటలో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. లింగన్న తల్లిదండ్రులకు అనారోగ్య సమస్యలతో చికిత్సకు, పంట సాగుకు అప్పు చేయాల్సి వచ్చిందన్నారు. అప్పు తీర్చలేక మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. భార్య పిట్ల లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య



ఆశన్న(ఫైల్)

ఇబ్రహీంపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోధుర్ గ్రామానికి చెందిన రెబ్బసి ఆశన్న(72) అనే వృద్ధుడు సోమవారం పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపారు. ఆశన్న భార్య రెబ్బసి శాంత మూడు నెలల క్రితం మరణించగా తట్టుకోలేక సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి మంచంపై పడిపోయాడు. కుటుంబ సభ్యులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కొడుకు రెబ్బసి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నాట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బాలిక ఆత్మహత్య

జగిత్యాల క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో సోమవారం ఓ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పట్టణంలోని గంజ్ ప్రాంతానికి చెందిన పదమూడు సంవత్సరాల బాలిక స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. రెండు రోజుల క్రితం తల్లిదండ్రులతో గొడవ పడి ఇంటి నుంచి పారిపోగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి హైదరాబాద్‌లో పట్టుకుని ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సోమవారం కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో బాలిక ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన పాత అరుణ్‌కుమార్ అనే వ్యాపారి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. పదిహేను రోజుల క్రితం అక్రమంగా 1.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఎవరైన పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసినా అక్రమంగా తరలించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) అదృశ్యమైంది. సోమవారం బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై కిరణ్ కుమార్‌గౌడ్ తెలిపారు. బాలిక మెట్‌పల్లిలోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. సంక్రాంతి సెలవుల కారణంగా ఇంటి వద్దే ఉంది. ఈ నెల 15న తల్లికి తెలపకుండా ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన రాసం రాకేష్ ప్రేమపేరుతో వేధించేవాడని, అతడిపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అత్యవసర సమయాల్లో అండగా..

- విపత్తులను ఎదుర్కొనేందుకు 'ఆపద మిత్ర'ల నియామకం
- జిల్లాలో 300 మంది వలంటీర్ల ఎంపిక
- స్థానిక ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులకు అవకాశం
- మొదటి దశలో 59 మందికి 12 రోజుల శిక్షణ



కరీంనగర్ క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తులు సంభవించినప్పుడు సరైన సమయంలో సహాయం అందక తీవ్ర నష్టం జరుగుతోంది. సమాచారం అందుకుని ప్రభుత్వ యంత్రాంగం అక్కడికి చేరుకునే ఆలస్యమవుతోంది. ఇలాంటి నష్టాలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ పథకాన్ని ప్రారంభించింది. గ్రామాల్లో, పట్టణాల్లో పనిచేసే ప్రభుత్వ రంగ ఉద్యోగులతో పాటు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారికి 'ఆపద మిత్ర' కింద విపత్తులు ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా అగ్నిమాపకశాఖ, పోలీసు శాఖ, పంచాయతీరాజ్ శాఖ, వైద్య శాఖ, పశుసంవర్ధక శాఖలకు చెందిన జిల్లా అధికారులు వలంటీర్లకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, పాము కాటు, కుక్కకాటు, అగ్ని ప్రమాదం, విద్యుదాఘాతం, వరదలు, రోడ్డు ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణను ఇచ్చారు. ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఆపద మిత్ర శిక్షణ తీసుకున్న వలంటీర్లు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటారు.

● స్థానికులకు ప్రాధాన్యం

ఆపదమిత్రలుగా శిక్షణ తీసుకున్న వారు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అక్కడికి చేరకుంటారు. నష్టం జరగకుండా.. బాధితులకు అండగా ఉంటారు. వరదలో చిక్కుకున్న వారు ఉంటే వారిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటారు. అవసరమైన ప్రభుత్వ శాఖలకు ఎప్పటి కప్పుడు సమాచారం అందజేస్తారు. మొదటి దశలో జిల్లాలోని 59 మంది వలంటీర్లకు ఆపదమిత్ర కింద శిక్షణ ఇచ్చారు. స్థానికులకే ఈ శిక్షణ ఇచ్చారు. శిక్షణకు హాజరైన వారు నేర్చుకున్న నైపుణ్యాలను, మెళకువలను మరో పదిమందికి నేర్పించాలని అధికారులు సూచించారు. అగ్నిప్రమాదాలు జరిగిన సమయాల్లో ఆస్తులు రక్షించడం, మనుషులు, జంతువుల ప్రాణాలను కాపాడడం, వరదల్లో కొట్టుకు పోతున్న వ్యక్తిని రక్షించడం వంటి అంశాల్లో శిక్షణ దిగువ మానేరు జలాశయంలో శిక్షణ ఇచ్చారు. తిమ్మాపూర్ మండలం నల్గొండలో నాలుగు ఫైరింజన్‌లతో ఫీల్డ్ ట్రైనింగ్ అందించారు. కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఆపదమిత్ర కోర్స్ కోఆర్డినేటర్ అయిన జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ఎం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 12 రోజులపాటు ఈ శిక్షణ కొనసాగింది.

● ప్రత్యేక రక్షణ కిట్లు....

మొదటి దశలో శిక్షణ పొందిన 59 మంది ఆపద మిత్రలకు త్వరలోనే ప్రత్యేక రక్షణ కిట్లను అందజేయనున్నారు. ఈ కిట్లలో స్పెషల్ గాగుల్స్, ఫైర్‌ప్రూఫ్ హెల్మెట్, లైవ్‌జాకెట్స్, షూ, రోప్, ఇతర రక్షణకు సంబంధించిన పరికరాలు, వస్తువులుంటాయి. ఈ రక్షణ కిట్లను త్వరలోనే శిక్షణ పూర్తి చేసుకున్న ఆపదమిత్రలకు అందించనున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే విపత్తుల నుంచి ప్రజలను రక్షించేందుకు కేంద్రప్రభుత్వ పథకంలో భాగంగా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆపదమిత్రలకు శిక్షణ అందిస్తున్నామని కోఆర్డినేటర్, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

శునకాల స్వైర విహారం

ఓదెల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. గూడెంలో రెండు రోజుల క్రితం రియాన్షు అనే చిన్నారిపై దాడి చేయడంతో మొఖంపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చిన్నారి తల్లిదండ్రులు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటన మూడు రోజుల క్రితం జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓదెల, పొత్కపల్లి, మడకలో రెండు రోజుల క్రితం దాడులకు పాల్పడ్డాయి. సోమవారం నాటు వేయడానికి వెళుతున్న కూలీలపై కుక్కలు కరవడంతో గాయాలకు గురై సుల్తానాబాద్, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోనరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం బావుసాయిపేట అనుబంధ గ్రామమైన రామన్నపల్లికి చెందిన బత్తుల మల్లయ్య (28) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వస్తూ అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. మల్లయ్య ఇంటి పనులపై బయటకు వెళ్లి ఇంటికి ఆదివారం రాత్రి తిరిగి వస్తున్నాడు. గ్రామ శివారులోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి కింద పడిపోగా తలకు గాయాలై మృతి చెందాడు. మృతుడు మల్లయ్య భార్య రేణవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోద చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



తెరిచి ఉన్న బీరువా

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. మూడు రోజుల క్రితం ఊరెళ్లిన ఇంటి యజమాని సోమవారం రాత్రి తిరిగి రావడంతో దొంగతనం వెలుగు చూసింది. గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న వంగల శ్రీనివాస్ భాగ్య దంపతులు మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని కుమారుడి వద్దకు వెళ్లారు. సోమవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో సుల్తానాబాద్ వచ్చారు. ఇంటి తాళం తీసి ఉండడంతో డయల్ 100కు సమాచారం ఇచ్చారు. దొంగలు తాళం ఊడదీసి లోపలికి చొరబడి బీరువాలను తెరిచి సామాన్లను కింద పడేశారు. హాల్‌లోని టీవీని ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఏ మేరకు చోరీ జరిగిందనేది తెలియాల్సి ఉంది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



టీఎన్‌జీవో డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, యూనియన్ నాయకులు

సుభాష్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం స్థానిక టీఎన్‌జీవో ఫంక్షన్ హాలులో టీఎన్‌జీవో ఆధ్వర్యంలో రూపొందించిన 2025 డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధానకార్యదర్శి ముజీబ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సంగెం లక్ష్మణ రావు, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, కట్కూరి నాగుల నరసింహ స్వామి, శ్రీకాంత్, రాగి శ్రీనివాస్, హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి సుమంత్‌రావు, రూరల్ అధ్యక్షుడు వాస్తవిక్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, కార్యదర్శి నాగరాజు, రామస్వామి, శంకర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బొంకురి శంకర్, కార్యదర్శి సత్యనారాయణ, జగిత్యాల అధ్యక్షుడు నాగేందర్, కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, కామ సతీష్, గిరిధర్‌రావు, శంకర్, మహిళ నాయకురాళ్లు శారద, సునీత, హరిప్రియ, లత, సరిత, పెన్షనర్ల సంఘం నాయకులు కేశవరెడ్డి, గాజుల నర్సయ్య, ఎలదాసరి లింగయ్య, రమేశ్, గోవిందపతి శ్రీనివాస్, పత్తేంశ్రీనివాస్, కరుణాకర్ పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న చిరుత సంచారం

● గేదెపై దాడి ● భయాందోళనలో ప్రజలు



ముస్తాఫానగర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనాదేవి

గంభీరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్ గ్రామ సమీప వ్యవసాయ పొలాల్లో చిరుత సంచారం కలకలం రేపుతోంది. ముస్తాఫనగర్‌కు చెందిన రాసమల్ల రాజు అనే రైతుకు చెందిన గేదెపై దాడిచేసి చంపేసింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కల్పనదేవి, డిప్యూటీ రేంజ్ అధికారి అంజలి, బీట్ అధికారి రమేష్ సంఘటన స్థలానికి చేరుకుని చిరుతగా అధికారులు నిర్ధారించారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ పొలాల వద్దకు రాత్రి వేళల్లో రైతు లు వెళ్లొద్దని, కొట్టాల్లో పశువులను ఉంచరాదని రేంజ్ అధికారి కల్పనదేవి సూచించారు.

● మండలంలో వరుస ఘటనలు

గంభీరావుపేట మండలంలో చిరుత సంచరిస్తూ వరుస దాడులకు పాల్పడుతోంది. మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామ సమీప వ్యవసాయ పొలాల వద్ద ఉన్న గేదెలపై అప్పట్లో చిరుత దాడి చేసి హతమార్చింది. ముచ్చర్ల ప్రాంతంలో రెండు మూడుసార్లు చిరుత దాడులకు తెగబడింది. అదే క్రమంలో గోరంటాల సమీప అడవుల్లో కూడా మేకల మందపై చిరుత దాడి చేసిన సందర్భాలు ఉన్నాయి. మల్లుపల్లె బ్రిడ్జి వద్ద ఇటీవల చిరుత అడవి పంది పిల్లలపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. గతంలో దమ్మన్నపేట సమీప అడవుల్లో చిరుత సంచరించింది. పలు గ్రామాల్లో చిరుత సంచారం అధికమవుతుండటంతో గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో బయటకు వెళ్ళేందుకు జంకుతున్నారు. ఒకే చిరుత ఇన్ని గ్రామాల్లోని వ్యవసాయ పొలాల్లో సంచరిస్తుందా లేక చిరుతల సంఖ్య పెరిగిందా అనే విషయం తెలియాల్సి ఉంది.

లొట్టి పోయి.. బాటిల్ వచ్చె..



తాటి చెట్టుకు కట్టిన ప్లాస్టిక్ బాటిల్స్

కోనరావుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అంతా ప్లాస్టిక్ మయం అయిపోయింది. ప్లాస్టిక్ భూతం కల్లు కుండలకు కూడా తాకింది. కుమ్మరి కులస్తులు చేసిన కుండలను కల్లుకోసం తాటి చెట్లకు కడుతుంటారు. మట్టి కుండల తయారీ తక్కువ కావడం, మరో వైపు వాటి ధరలకు కూడా పెరిగిపోవడంతో గౌడ కులస్తులు కొన్ని చోట్ల తాటి చెట్టుకు కుండలకు బదులుగా ప్లాస్టిక్ బాటిల్స్ కడుతున్నారు. సుద్దాల గ్రామ శివారులో తాటిచెట్టుకు కట్టిన వాటర్ బాటిల్స్‌ను ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. మార్కెట్‌లో కుండలు లభించక ప్లాస్టిక్ బాటిల్స్ కట్టినట్లు గౌడ కులస్తులు పేర్కొంటున్నారు. వీటిని చెట్లకు కట్టడం సులభంగా ఉందన్నారు.

అగ్ని ప్రమాదంలో రూ.55 వేల ఆస్తి నష్టం





మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కరీంనగర్ క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో సోమవారం వేకువజామున జరిగిన రెండు అగ్నిప్రమాదాల సంఘటనల్లో రూ.55 వేల విలువైన ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు. కరీంనగర్ శివారులోని తీగలవంతెన సమీపంలోని సోహెల్ హోటల్(దాబా)లో ఉదయం 4:30 గంటలకు మంటలు అంటుకోవడంతో వెంటనే స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది ఫైరింజన్ వాహనంతో వెళ్లి మంటలను ఆర్పివేశారు. హోటల్‌లో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకుని రిఫ్రిజిరేటర్, వంట నూనె, ఇతన ఆహార ముడి పదార్థాలు దగ్ధమయ్యాయని, వాటి విలువ సుమారు 50 వేల వరకు ఉంటుందని హోటల్ యజమాని ఆసిఫ్‌ఖాన్ ఫిర్యాదు చేశాడని అధికారులు తెలిపారు. మంచిర్యాల చౌరస్తాలోని వీఆర్‌ఆర్ నగర్‌లో ఇంటి పక్క ఖాళీ స్థలంలో కర్రలకు మంటలు అంటుకొని దగ్ధమమయ్యాయి. ఫైరి సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సుమారు 5 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు.

దాడికి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో దాడికి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామానికి చెందిన బందుకు శ్రీనివాస్, అతని కుమారుడు నరేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని గడ్డం ఆనందం అనే వ్యక్తికి చెందిన వ్యవసాయ భూమి విషయంలో గొడవ జరిగిందని పేర్కొన్నారు. ఈ నెల 19న ఆనందం భార్య పుష్పలత, కొడుకు కరుణాకర్, జగన్‌లు తమ వ్యవసాయ పొలానికి చేరుకోగా శ్రీనివాస్, నరేశ్‌లు అడ్డుకోవడంతో పాటు కర్ర, గడ్డపార, కొడవలితో దాడి చేసి గాయాపరిచారని చెప్పారు. బాధితుడు ఆనందం ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ఒకరి రిమాండ్

శంకరపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో చిట్టి డబ్బుల విషయంలో జరిగిన గొడవలో ఓ వ్యక్తి కోమాలోకి పోవడానికి కారణమైన వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొలంగూర్ గ్రామానికి చెందిన కొలిపాక సమ్మయ్య అదే గ్రామానికి చెందిన కల్లూరు శ్రీనివాస్ అనే వ్యక్తుల మధ్య చిట్టి డబ్బుల విషయంలో గతంలో గొడవ జరిగింది. ఈ గొడవలో బైక్ పైన ఉన్న సమ్మయ్యను శ్రీనివాస్ కిందకి తోసి తలపై కొట్టడంతో బలమైన గాయమైంది. దీంతో సమ్మయ్య కోమాలోకి పోయాడని అతని భార్య కొలిపాక నిర్మల కల్లూరు శ్రీనివాస్‌పై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి సోమవారం శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

వివాహితను వేధిస్తున్న యువకుడి అరెస్టు

ఇల్లంతకుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను లైంగికంగా వేధిస్తున్న యువకుడిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. ఎస్సై వివరాల ప్రకారం బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన కతెరపాక దిలీప్ అనే యువకుడు తరచూ వివాహితను వెంబడించడంతో పాటు లైంగిక వేధింపులకు గురిచేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామానికి చెందిన తుమ్మ ప్రసాద్ (40) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తుమ్మ ప్రసాద్ ద్విచక్ర వాహనంపై శనివారం కనుకుల నుంచి సుల్తానాబాద్ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ప్రసాద్ సోమవారం మృతి చెందారు. మృతుడికి కొడుకు కూతురు ఉన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

- పెరిగిన వాహనాల రాకపోకలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



తుమ్మన్నపల్లి గ్రామంలో ఇరుకుగా ఉండి.. సైడ్ వాల్స్ దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్న వంతెన

హుజూరాబాద్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఉన్న ఎస్సారెస్పీ కాలువ పై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వాహనాల రద్దీ పెరిగిపోవడంతో వంతెనలు ఇరుకుగా మారడంతో రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

● వంతెనలకు ఇరువైపులా దెబ్బతిన్న సైడ్ వాల్స్

మండలంలోని కొత్తపల్లి, తుమ్మనపల్లి, ఇప్పలనర్సింగాపూర్, సైదాపూర్ రోడ్డు, కేసీ క్యాంపు వద్ద, పెద్దపాపయ్యపల్లి గ్రామాల మీదుగా ఎస్సారెస్పీ కాలువపై చాలా ఏళ్ల క్రితం వంతెనలు నిర్మించారు. వాటికి ఇరువైపులా సైడ్‌వాల్స్ దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం ఎస్సారెస్పీ కాలువలో నీళ్ల నిండుగా పారుతుండగా, సైడ్‌వాల్స్ దెబ్బతిని ఉండటంతో ఎదురుగా భారీ వాహనాలు వస్తున్న సమయంలో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● కానరాని సూచికలు :

ఎస్సారెస్పీ కాలువపై నిర్మించిన వంతెనల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కరీంనగర్- వరంగల్ ప్రధాన రహదారిపై మూడు చోట్ల ఉన్న వంతెనలు పూర్తిగా ఇరుకుగా మారాయి. ఈ దారి గుండా ప్రతిరోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెనల సమీపంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే భారీ వాహనదారులు నెమ్మదిగా వచ్చే అవకాశం ఉంటుంది. అధికారులు స్పందించి దెబ్బతిన్న వంతెన సైడ్‌వాల్స్‌కు మరమ్మతులు చేయించి, వంతెనల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రయాణం ప్రమాదకరంగా మారింది

- ఖాషవేని రాజేష్‌యాదవ్, వాహనదారుడు, సింగాపూర్



తుమ్మనపల్లి గ్రామంలోని ఎస్సారెస్పీ కాలువపై ఉన్న బ్రిడ్జి పూర్తిగా ఇరుకుగా మారింది. దీనికి తోడు బైపాస్ రోడ్డు పనులు జరుగుతుండటంతో సామర్థ్యానికి మించి లోడుతో లారీలు తిరుగుతున్నాయి. ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. రాత్రి వేళలో ఈ బ్రిడ్జి సమీపంలో వీధి దీపాలు సైతం లేకపోవడం, బ్రిడ్జి సైడ్‌వాల్స్ దెబ్బతిని ఉండటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది.


భారత జట్టుకు సూచనలు ఇస్తున్న నరేష్

గ్రామీణ క్రీడకు అంతర్జాతీయ ఖ్యాతి

● ఖోఖోలో విశ్వ విజేతలుగా భారత జట్లు

● మహిళల జట్టుకు కోచ్‌గా జిల్లా వాసి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 20: గ్రామీణ క్రీడ ఖో-ఖోకు అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. పల్లెల్లో, పాఠశాలల్లో చిన్నారులు, విద్యార్థులు ఆడుకునే ఖో-ఖో ఆటలో మహిళలు, పురుషుల విభాగాలలో మన జట్లు విశ్వవిజేతలుగా నిలిచాయి. ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఖో-ఖో ఫెడరేషన్ ఆఫ్


ప్రపంచ కప్‌ను ముద్దాడుతున్న కోచ్ నరేష్

ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచకప్ పోటీల్లో 23 దేశాలు పాల్గొన్నాయి. ఆదివారం రాత్రి నిర్వహించిన మహిళల ఫైనల్స్ మ్యాచ్‌లో భారత జట్టు నేపాల్ జట్లతో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో భారత జట్టు 78-40 పాయింట్ల తేడాతో నేపాల్‌ను చిత్తుచేసి తొలి ప్రపంచకప్‌ను తన ఖాతాలో వేసుకుంది. పురుషుల విభాగంలో భారత జట్టు నేపాల్‌పై 54-36 పాయింట్ల తేడాతో గెలుపొంది ప్రపంచకప్‌ను ముద్దాడింది. ప్రపంచ చాంపియన్‌గా భారత్‌ను నిలపడంలో ఉమ్మడి కరీంనర్ జిల్లా ధర్మారం బంజరుపల్లి తండావాసి ఇస్లావత్ నరేష్ ముఖ్య భూమిక పోషించారు. నరేష్ భారత మహిళల జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. 30 రోజులపాటు శిక్షణను అందించి భారత్‌ను ప్రపంచ చాంపియన్‌గా నిలిపాడు.

● ఖో-ఖో మహిళల జట్టు కోచ్ ఇస్లావత్ నరేష్ నేపథ్యం

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): ఖో-ఖోలో భారత మహిళల జట్టు ప్రపంచ కప్ గెలవడంలో ధర్మారం మండలం లంబాడితండా (బి)కు చెందిన ఇస్లావత్ నరేష్ కీలక పాత్ర పోషించారు. ఖో-ఖోలో అద్భుత ప్రతిభ చూపి భారత్ మహిళల జట్టు కోచ్‌గా నియమి తులయ్యారు. ఆయన శిక్షణలో రాటుదేలిన జట్టు ప్రపంచ చాంపిన్‌గా నిలిచింది.

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం లంబాడితండా (బి) గ్రామానికి చెందిన ఇస్లావత్ రూపానాయక్-సాంతారీల కుమారుడు ఇస్లావత్ నరేష్. వీరిది ఓ సాధారణ వ్యవసాయ కుటుంబం. నరేష్‌కు చిన్ననాటి నుంచి ఆటలంటే మక్కువ. హుస్నాబాద్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువ కున్న ఆయన ఖో-ఖోలో పలు పథకాలు సాధించారు. 2006లో రైల్వే శాఖలో సౌత్ సెం ట్రల్ నాందేడ్ డివిజన్‌లో ఉద్యోగం సాధించారు. ఆయన ప్రతిభను గుర్తించిన రైల్వే శాఖ తమ జట్టుకు 2016లో కోచ్‌గా నియమించింది. ఆయన శిక్షణ తీరును గమినించి స్పోర్ట్స్ ఫెడరేషన్ నరేష్‌ను ప్రపంచ కప్‌లో భారత మహిళా జట్టుకు కోచ్‌గా నియమించింది. ఆయన శిక్షణలో రాటు దేలిన క్రీడాకారులు ప్రపంచ చాంపియన్లుగా నిలిచారు.

ఖో-ఖోతో ఉజ్వల భవిష్యత్తు


- ఇస్లావత్ నరేష్, భారత మహిళల జట్టు కోచ్

ఖో-ఖో క్రీడతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఈ క్రీడతో పలు సంస్థలు ఉద్యోగావ కాశాలు కల్పిస్తున్నాయి. ప్రపంచ చాంపియన్లుగా నా శిక్షణలో భారత జట్టు నిలిచింది. 2027లో ఇంగ్లాండ్‌లో ప్రపంచ కప్ వరకు చీఫ్ కోచ్‌గా ఎదగాలనుకుంటున్నాను.

ఖో-ఖోకు ఒలింపిక్స్‌లో స్థానం కల్పించాలి..


- వై మహేందర్‌రావు, ఖో-ఖో సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి

ఖో-ఖో క్రీడకు ఒలంపిక్స్‌లో స్థానం కల్పించాలి. రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్లు పది సంవత్సరాలుగా విశేష ప్రతిభ చాటుతున్నాయి. భారత ఖో-ఖో జట్టు కోచ్‌గా మన జిల్లాకు ఎందిన నరేష్ వ్యవహరించడం మనందరికీ గర్వకారణం.

జాతీయ జట్టులో స్థానం సాధిస్తా..


- నవీన్‌రాజ్, సీనియర్ జాతీయ క్రీడాకారుడు

తొలి ప్రపంచకప్ ఖో-ఖో పోటీల్లో భారత్ మహిళల, పురుషుల విభాగాల్లో చాంపియన్‌గా నిలవడం ఆనందంగా ఉంది. వచ్చే ప్రపంచకప్ పోటీల్లో స్థానం సాధించేందుకు నేను ఇప్పటి నుంచి తీవ్రంగా కృషి చేస్తాను. ఖో-ఖో అంతర్జాతీయ స్థాయికి చేరవడం ఆనందంగా ఉంది.

భారత జట్లకు అభినందనలు....


- గజ్జల భవాని, జాతీయ క్రీడాకారిణి

ప్రపంచ ఖో-ఖో పోటీల్లో భారత జట్లు చాంపియన్లుగా నిలవడం ఆనందంగా ఉంది. మహిళలు, పురుషుల జట్లకు అభినందనలు. గతంలో ఖో-ఖో జాతీయ క్రీడగా మాత్రమే ఉండేది. ఇప్పుడు 23 దేశాలు ప్రపంచకప్ పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది.

ఆర్టీసీకి సంక్రాంతి జోష్

● కరీంనగర్ రీజియన్ పరిధిలో రూ.24.71 కోట్ల ఆదాయం



భగత్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు కరీంనగర్ రీజియన్ పరిధిలో 24.71 కోట్ల రూపాయల ఆదాయం లభించింది. పండగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపింది. రీజియన్ వ్యాప్తంగా 11 డిపోల పరిధిలో ఈ నెల 7వ తేదీ నుంచి 19 వరకు (13, 14తేదీలు మినహాయించి) ఆయా రూట్లలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర వేసింది. ఇందులో జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు, తిరుగు ప్రయాణంలో కరీంనగర్ నుంచి జేబీఎస్ వరకు ఎక్కువ బస్సు సర్వీసులు నడిపారు.

డిపోల వారీగా ఆదాయ వివరాలు

డిపో	ఆదాయం (కోట్లలో)	కిలోమీటర్ల (లక్షల్లో)	ఈపీకే	ఓఆర్	ప్రయాణికులు (లక్షల్లో)
గోదావరిఖని	3.69	6.01	61.43	98	7.53
హుస్నాబాద్	1.37	2.46	55.69	98	3.60
హుజూరాబాద్	1.75	2.88	60.80	107	4.12
కరీంనగర్-1	2.70	5.21	51.83	78	5.48
కరీంనగర్-2		3.16	6.36	49.72	80 4.38
మంథని	1.49	2.59	57.45	92	2.54
జగిత్యాల	3.18	5.58	57.08	89	6.33
కోరుట్ల	1.90	2.99	63.38	100	3.74
మెట్‌పల్లి	1.79	2.86	62.74	101	3.86
సిరిసిల్ల	1.84	3.04	60.50	100	3.83
వేములవాడ	1.83	3.23	56.61	94	3.59
రీజియన్	**24.71**	**43.21**	**57.18**	**92**	**48.99**

సిబ్బంది సహకారంతో..

- బి.రాజు, ఆర్టీసీ ఆర్ఎం



సంక్రాంతి పండగ సందర్భంగా ఆయా రూట్లలో రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాం. సిబ్బంది సహకారంతోనే ఇంత ఆదాయం పొందగలిగాం. రద్దీకి అనుగుణంగా తగినన్ని బస్సులను ఏర్పాటు చేసిన అధికారులతో పాటు సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లకు ఆర్టీసీని ఆదరించిన ప్రయాణికులకు ధన్యవాదాలు. సంస్థపై ఇదే ఆదరణను కొనసాగించాలని కోరుతున్నాం.

రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌గా కరీంనగర్

● ద్వితీయ స్థానంలో వరంగల్

● మహబూబ్‌నగర్‌కు తృతీయ స్థానం

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి 46వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో మూడు రోజులుగా కొనసాగుతున్న పోటీలు సోమవారం


చాంపియన్స్ ట్రోఫీ అందుకుంటున్న కరీంనగర్ జిల్లా జట్టు

ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు వరంగల్‌పై 18-16 గోల్స్ తేడాతో విజయం సాధించింది. మహబూబ్‌నగర్ జట్టు తృతీయ, ఆదిలాబాద్ నాలుగో స్థానంలో నిలిచాయి. కరీంనగర్ జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. డీఆర్వో పవన్ కుమార్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి నెమలికొండ ప్రభాకర్, రెప్రిస్ బోర్డు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, వివిధ జిల్లాల కార్యదర్శులు శంకర్, ఎడ్ల ప్రవీణ్ కుమార్, సిరికొండ శ్రీనివాస్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, హనుమంతు, రమే ష్, వీర్‌పాల్, దిలీప్ పాల్గొన్నారు.

17వ బెటాలియన్ కానిస్టేబుల్స్‌కు స్విమ్మింగ్ శిక్షణ

ముస్తాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఓ స్విమ్మింగ్ పూల్‌లో సోమవారం రోజున 17వ బెటాలియన్ కమాండెంట్ గంగారాం ఆధ్వర్యంలో బెటాలియన్ కానిస్టేబుల్స్‌కు ఈత పోటీలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు (ఎస్‌డిఆర్ఎఫ్) రాష్ట్రంలో విపత్తు నివారణ చర్యల్లో భాగంగా నిర్వహించే సహాయక కార్యక్రమాల్లో పాల్గొనే బెటాలియన్ పోలీసులకు ఈతలో ప్రావీణ్యం కలిగి ఉండాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంభవించే విపత్తు నివారణ చర్యలలో వీరంతా పాల్గొనడానికి ముందస్తుగా శిక్షణ ఇప్పించామని బెటాలియన్ కమాండెంట్ గంగారాం తెలిపా రు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, రమేష్, ఎస్ఐ నరేష్, సంతోష్, శ్రీధర్, 150 మంది బెటాలియన్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


శిక్షణ పొందుతున్న కానిస్టేబుల్స్

'వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు'ను విజయవంతం చేయాలి

● బీసీ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరువు అంజన్న


సమావేశంలో దరువు వేస్తున్న అంజన్న

జగిత్యాల అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న ఏర్పాటు చేసిన వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరువు అంజన్న అన్నారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధం చేయాలని చెప్పినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఎస్సీ వర్గీకరణపై ముఖ్యమంత్రి నాలుగు నెలల క్రితం ప్రకటించి తప్పడంతో మరో ఉద్యమం చేయక తప్పడం లేదని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బాలె శంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, భోనగిరి కిషన్, రాచకొండ రోజా, నక్క సతీష్, కొల్లూరి సురేందర్, రాపర్తి రవి, బండ పల్లి మల్లీశ్వరి, భోనగిరి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్, జనవరి 20: (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు సుల్తానాబాద్ కు చెందిన ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఎం సంప్రీత్ ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియలు తెలిపారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలలో సంప్రీత్ ప్రతిభను చూపడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారన్నారు. ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్ లో జరుగనున్న రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలలో పాల్గొననున్నారు. సంప్రీత్‌ను అభినందించారు.

● ఓపెన్ చదరంగ పోటీల్లో విశాల్ ప్రతిభ

ఎలిగేడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాలో ఈనెల 19న జరిగిన ఇండియా ఓపెన్ చదరంగం పోటీల్లో ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన తాటిపెల్లి విశాల్ ప్రతిభకనబరిచాడు. ఓపెన్ విభాగంలో 7రౌండ్లకు గాను 5రౌండ్లు గెలిచాడు. విశాల్‌కు ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యానారాయణరావు చేతులమీదుగా నగదు బహుమతి ప్రశంసాపత్రం ట్రోఫీ అందజేశారు ఆర్గనైజర్ నందకిషోర్, వెంకటగిరి, సీనియర్ కోచ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ చైర్మన్

ఆదాయ పన్ను రద్దు చేయాలి

● రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ఆందోళన


పోస్టుకార్డును ప్రదర్శిస్తున్న రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు

కోరుట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని సోమవారం కోరుట్ల పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట తెలంగాణ పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు నిరసన తెలిపి పోస్టు కార్డు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ మాట్లాడారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులకు పోస్టు కార్డులను పంపించారు. ఆర్‌డీఓ జీవాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం ద్విచక్ర వాహన ర్యాలీని తపాల కార్యాలయం వరకు నిర్వహించి పోస్టు కార్డును పోస్టు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు హన్మంత రెడ్డి, బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, వెల్మల ప్రకాష్‌రావు, పబ్బా శివానందం, గంటేడి రాజ్‌మోహన్, యాకుబ్, నల్లాల లక్ష్మీనారాయణ, ఎండి సైపోద్దిన్, రాజయ్య, చిలుక గంగారాం, స్వామి, రాజేశ్వర్, లక్ష్మీకాంతం, మల్యయ్య, గోపాల్, శ్రీరాములు, సాబితలీ, నారాయణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7350 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 30మంది రైతులు 311క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు ఎనిమిది క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7350, కనిష్ఠ ధర రూ.6300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

భక్తజన సంద్రం... రాజన్న క్షేత్రం


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న భక్తులు

● ఆలయానికి పోటెత్తిన భక్తులు

● దర్శనానికి నాలుగు గంటల సమయం

వేములవాడ కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. కొమరవెల్లి మల్లన్న వారంపట్నంను పురస్కరించుకుని వేములవాడ రాజన్నకు భక్తులు మొక్కులు చెల్లించుకోవడం ఆనవా యితీ. ముందుగా కల్యాణకట్టలతో తలనీలాలు సమర్పిం చుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకునే భక్తులు క్యూలైన్‌లో నాలుగు గంటలపాటు నిరీక్షించారు. ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్‌లో భక్తులతో కిక్కిరిసిపోయాయి. అమ్మ వారికి ఓడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించు కున్నారు.


రాజన్న ఆలయ ఆవరణలో తనిఖీలు చేస్తున్న భద్రత సిబ్బంది

● బాంబ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు..

రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి సోమవారం భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో జిల్లా బాంబ్, డాగ్ స్క్వాడ్ టీం సభ్యులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఆలయ పరిసరాలతో పాటు పార్కింగ్ స్థలాలు, వసతిగదులతో పాటు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.

● స్మార్ట్ టీవీల ఏర్పాటు..

రాజన్న ఆలయంలో నిర్వహించే పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయానికి వచ్చే భక్తులు వీక్షించేందుకు వీలుగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పలు ప్రాంతాల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. రాజన్న ఆలయ లడ్డుల కౌంటర్, కోడెమొక్కు క్యూలైన్‌లతో పాటుగా పలు ఓపెన్ స్థలాల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయగా రాజన్న ఆలయంలో భక్తులు ఎక్కువగా ఉండే స్థలాల్లో భక్తులు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు భారీ ఫ్యాన్‌లను ఏర్పాటు చేశారు.

వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు


హరికథను చెబుతున్న భాగవతరాణి నాగరాణి

● ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వేములవాడ కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం త్యాగరాజ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతి, నాగరాణి, శ్రీరాంభట్టర్ వేర్వేరుగా తమ హరికథతో భక్తులను ఆకట్టుకున్నారు. సాయంత్రం వైలెన్ సోలో కచేరి వినయకృష్ణ చేపట్టగా నరహరి, సతీష్ ఆధ్వర్యంలో సంగీత కచేరిని నిర్వహించారు. రతన్‌కుమార్ బృందం చేసిన నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● త్యాగరాజస్వామి వారి కీర్తనలు చరిత్రలో నిలిచిపోతాయి..

త్యాగరాజస్వామి వారి కీర్తనలు చరిత్రలో నిలిచిపోతాయని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న ఆరాధనోత్సవాలను సోమవారం ప్రారంభించి కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 72 సంవత్సరాలుగా వేములవాడ రాజన్న ఆలయంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు చేపట్టడం గొప్ప విషయమని అన్నారు.


శాస్త్రీయ నృత్యం చేస్తున్న రతన్ కుమార్ బృందం

ఆయిల్ పామ్‌తో అధిక ఆదాయం

(5వ పేజీ తరువాయి)

అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చు. నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి వస్తుంది. ఎకరాకు కనీసం 10 టన్నులకు తక్కువ కాకుండా దిగుబడి పొందవచ్చు. ఇతర ప్రాంతాల్లో ప్రస్తుతం సాగు చేస్తున్నవారికి 15 నుంచి 18 టన్నుల దిగుబడి వస్తోందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వివిధ కంపెనీలు టన్నుకు రూ.20,500 చెల్లించి ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేస్తున్నాయి. 10 టన్నుల దిగుబడి వచ్చినా ఎకరాకు రూ.2లక్షలకు తగ్గకుండా ఆదాయం వచ్చే అవకాశముంది. పెట్టుబడుల కింద 25 వేల నుంచి 30వేల రూపాయలు ఖర్చుచేసినా రైతులకు నికరంగా లక్షా 75 వేల రూపాయలు మిగిలే అవకాశమున్నది.

● వరివైపే రైతుల మొగ్గు

రైతులకు అవగాహన లేక పోవడంతో సాంప్రదాయ వరిసాగు పైనే దృష్టిసారిస్తున్నారు. జిల్లాలో రైతులు మూడు లక్షల ఎకరాల్లో వరిసాగును చేపడుతున్నారు. వానాకాలం, యాసంగి సీజన్లలో కలిపి సుమారు 65 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధిస్తున్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు 2,300 రూపాయల మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నందున రైతుకు ఎకరాకు లక్షా 50 వేల రూపాయలు సమకూరుతున్నాయి. 50 వేల నుంచి 60 వేల రూపాయల వరకు నిర్వహణ ఖర్చులు పోగా రైతులకు సుమారు 90 వేల నుంచి లక్ష రూపాయలు మిగులుతున్నాయి. సన్నవరి సాగు చేస్తే బోనస్‌గా క్వింటాల్‌కు మరో 500 రూపాయలు లభిస్తున్న నేపథ్యంలో రైతులు వరి సాగువైపే మొగ్గు చూపుతున్నారు. వరిసాగును వదిలి వాణిజ్య పంటల వైపు దృష్టిసారిస్తే రెట్టింపు ఆదాయాన్ని పెంచుకోవచ్చనే అవగాహనను వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ కల్పించాలి. విస్తృత సదస్సులు నిర్వహిస్తే ప్రభుత్వం అనుకున్న విధంగా ఈ జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రీమియర్ బ్యాంకర్ శిక్షణ



విద్యార్థినులతో కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఇన్ఫోసిస్, ఐసిటి అకాడమి సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రీమియర్ బ్యాంకర్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇన్ఫోసిస్ వంటి ప్రఖ్యాత సంస్థలు అందిస్తున్న ఈ తరహా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐసిటి అధినేత గోపాల్ మాట్లాడుతూ శిక్షణలో బ్యాంకింగ్ రంగంలో విద్యార్థులకు అవసరమైన అన్ని అంశాలు ఉన్నట్లు, ఫిబ్రవరి 7వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ దినేష్, చంద్రవదన పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లి కేబుల్ బ్రిడ్జి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాసరా ఫ్యూయలింగ్ స్టేషన్ (పెట్రోల్‌బంక్)ను మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. నిర్వాహకులు నాగసముద్రం వాసరయ్య, నాగసముద్రం శ్రీనివాస్ మాట్లాడుతూ కేబుల్ బ్రిడ్జి రోడ్‌లో వాహనదారులకు సౌకర్యంగా ఉండే విధంగా బంక్ ఏర్పాటు చేశామన్నారు. నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, మల్లికార్జున రాజేందర్, ఆకుల ప్రకాశ్, భూమాగౌడ్, ఆకుల నర్సయ్య, పొన్నం సత్యం పాల్గొన్నారు.

ముగిసిన రైతు భరోసా సర్వే

కరీంనగర్ రూరల్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి):: రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియలో భాగంగా ఈ నెల 16వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వే సోమవారం ముగిసింది. చివరి రోజు మండలంలోని చేగుర్తి గ్రామంలో సర్వే నిర్వహించారు. రైతు భరోసా సర్వేలో వ్యవసాయ యోగ్యమైన, యోగ్యంకాని భూములను గుర్తించారు.

వార్డు సభలను సద్వినియోగం చేసుకోండి

● నియోజవకర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రణవ్

హుజూరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో భాగంగా మంగళవారం నుంచి గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించే గ్రామ వార్డు సభలను నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలపై గ్రామాల్లో, పట్టణాల్లో వార్డు సభలు అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. గతంలో పేర్లు నమోదు కాని వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఏకగ్రీవంగా ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

హుజూరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని పాపారావు బొంద ఆటో యూనియన్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇసంపల్లి రాజేందర్, ఉపాధ్యక్షుడిగా కొంగ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రావు, కోశాధికారిగా బాణాల రాజు, ప్రచార కార్యదర్శిగా రెంటాల లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులుగా వేణు, తిరుపతి, రఫీ,మధు, అంకుష్, ఎండీ పాషా, రవి, స్వామి, లింగారెడ్డి ఎన్నికయ్యారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

హుజూరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు మేకల తిరుపతి అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మిడిదొడ్డి రాజు, చెవుల సురేష్ ఉన్నారు.

● వీణవంక: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● తిమ్మాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను అడ్డుకుంటే తరిమికొడతామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గంగాధర, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం నారాయణపూర్ పంపుహౌస్ వద్ద ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ముందస్తుగా ఎల్లంపల్లి నీటిని విడుదల చేయించిన ఘనత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకే దక్కుతుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత‌శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, పార్టీ మండలాధ్యక్షుడు మనోహర్, నాయకులు పాల్గొన్నారు.

● పంటలు ఎండిపోకుండా చివరి మడివరకు నీరందించేందుకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి చేశారని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వొడ్నాల యగ్నేష్ అన్నారు. ఎల్లంపల్లి నీరు విడుదల చేసినందుకు రైతుల పక్షాన అభినందనలు తెలుపుతూ గంగాధరలో సంబరాలు నిర్వహించారు.

అన్ని సౌకర్యాలతో స్వశక్తి సంఘ భవనాలు



భవనాన్ని ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్వశక్తి మహిళా సమాఖ్య సంఘాల కోసం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలతో భవనాలను నిర్మించామని, సభ్యులే వాటిని కాపాడుకోవాలని కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. నగరంలోని 35వ డివిజన్‌లో రూ.40 లక్షలతో నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో స్మార్ట్‌సిటీ, పట్టణ ప్రగతి, సీఎం హామీ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ప్రజల ఆశీర్వాదంతో రాబోయే రోజుల్లో మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.35 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పైపు లైన్ పనులను కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం 53వ డివిజన్‌లో కార్పొరేటర్ శ్రీదేవిచంద్రమౌళితో కలిసి రూ.5 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను ప్రారంభించారు. డీఈలు అయూబ్‌ఖాన్, ఓంప్రకాశ్, గట్టుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని 16వ డివిజన్ పద్మనగర్‌లో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయని, ఈ నెలాఖరులోగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకొస్తామని మేయర్ సునీల్‌రావు తెలిపారు. కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్‌తో కలిసి సోమవారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను సందర్శించారు.

బావుపేటను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి



మంత్రి పొన్నంకు వినతి పత్రం అందజేస్తున్న కొత్తపల్లి మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్

భగత్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బావుపేటను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కొత్తపల్లి మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బావుపేట గ్రామాన్ని మండల కేంద్రంగా చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు. బావుపేట, నాగులమల్యాల, బద్దిపల్లి, కమాన్‌పూర్, ఎలగందల్, ఖాజీపూర్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరాఫరా నిలిపివేత

గణేష్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణంతోపాటు రూరల్ ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, రూరల్ ఏడీఈలు శ్రీనివాస్‌గౌడ్, రఘు ప్రకటనలో తెలిపారు. మరమ్మతు పనుల్లో భాగంగా సాయిబాలాజీ నగర్, సీతారాంపూర్, జగిత్యాల రోడ్డు (ఎదురుగా ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల), కరీంనగర్‌రూరల్ పరిధిలో చర్లబూత్కుర్, చామనపల్లి, దుబ్బపల్లి, తహెర్ కొండాపూర్, బహదూర్ ఖాన్‌పేట్, జూబ్లీనగర్, ఫకీర్‌పేటలో ఉదయం 11 గంటల నుంచి 2వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు.

అర్బన్ బ్యాంకు అభివృద్ధికి కృషి



విలాస్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

కరీంనగర్ టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అర్బన్ బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తామని బ్యాంకు చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బ్యాంకులో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తమపై విశ్వాసంతో పాలకవర్గాన్ని నియమించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంకు అభివృద్ధి, ఖాతాదారులు, సభ్యులకు మెరుగైన సేవలందించేందుకు సమష్టిగా కృషి చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధికి, ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు పాలకవర్గం కృషి చేయాలన్నారు. అనంతరం చైర్మన్ విలాస్‌రెడ్డిని కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, గంట కల్యాణి శ్రీనివాస్, మెండి శ్రీలతచంద్రశేఖర్, కొశెట్టి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు భూమయ్య, ఉమాపతి, రవీందర్, స్వామిరెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు సన్మానించారు. బ్యాంకు సీనియర్ సభ్యులు లక్ష్మణ్‌రాజు, షమీయొద్దీన్, సీఈవో నునుగొండ శ్రీనివాస్, కమిటీ సభ్యులు భాస్కర్, సాయికృష్ణ, సందీప్, లక్ష్మి, విద్యాసాగర్, రవి, సతీష్, రాజు, పీసీసీ కార్యదర్శి అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై కాంగ్రెస్ కపట ప్రేమ



సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

భగత్‌నగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్‌పై కాంగ్రెస్ కపట ప్రేమ కనబరుస్తోందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ అన్నారు. సోమవారం రేకుర్తిలోని సాయి మహాలక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించిన 'సంవిధాన్ గౌరవ్ అభియాన్' సన్నాహక సమావేశంలో మాట్లాడారు. అంబేద్కర్ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ పనిచేస్తోందన్నారు. ఎన్నికల్లో అంబేద్కర్‌ను ఓడించిన చరిత్ర, రాజ్యాంగానికి తూట్లు పొడిచిన చరిత్ర కాంగ్రెస్‌దేనన్నారు. 75వ భారత రాజ్యాంగ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి సంవిధాన్ గౌరవ్ అభియాన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రావు, రాజేంద్రప్రసాద్, అంజనేయులు, ఓదెలు, వెంకటరెడ్డి, రమేష్, బీజేపీ సంవిధాన్ జిల్లా కో-ఆర్డినేటర్ బాల్‌రెడ్డి, శశిధర్, కళ్యాణ్‌చంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆర్టిజన్ల రిలే దీక్షలు

గణేష్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్లు సోమవారం కరీంనగర్‌లోని ఎస్‌ఈ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ నాయకుడు సదానందం మాట్లాడుతూ ఆర్టిజన్ల కన్వర్షన్ సాధన కోసం చేస్తున్న రిలే దీక్షలకు మద్దతు తెలపాలన్నారు. ఆర్టిజన్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. విద్యుత్ అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు అసోసియేషన్ సంఘాల నాయకులు ఆర్టిజన్ కార్మికులు చేస్తున్న దీక్షలకు మద్దతు తెలిపారు. టీవీఏసీ జేఏసీ కరీంనగర్ జిల్లా ఆర్టిజన్ నాయకులు శివకృష్ణ, అమానుల్లా, రాష్ట్ర నాయకులు రఘునాథ్‌రెడ్డి, జీవన్, శ్రీనివాస్ నాయక్, సంతోష్, రహీమ్, చందర్‌సింగ్, వేణు, పర్శరాం, రవి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించండి

కరీంనగర్ రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల కోసం ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించాలని ఎంపీడీవో సంజీవరావు సూచించారు. మంగళవారం నుంచి నిర్వహించనున్న గ్రామ సభలకు సంబంధించి కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జాబితాలో పేరు రాని వారు ఎవరైనా ఉంటే వారి వద్ద నుంచి దరఖాస్తులను సేకరించాలన్నారు. ప్రతీ పథకంలో అర్హులకు లబ్ధి చేకూరే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీవో శోభరాణి, ఏఈవోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

కరీంనగర్ కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఈవో కొస్న కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ యాగండ్ల అనిల్‌కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. ఈవో కొస్న కాంతారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు సత్య నారాయణ, ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్, కృష్ణ, కవిత, ఎక్స్ అఫీషియో మెంబర్ రాజేశ్వరశర్మ పాల్గొన్నారు.

● జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయాల హుండీలను సోమవారం లెక్కించగా రూ. 3,95,430 ఆదాయం లభించినట్లు ఈవో కొస్న కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ అనిల్‌కుమార్ గౌడ్ తెలిపారు.

నేటి నుంచి లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభలు

కరీంనగర్ రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, తెల్ల రేషన్ కార్డు దరఖాస్తుదారుల పరిశీలన సర్వే, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు కరీంనగర్ మండలంలో అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నారు. సంక్షేమ పథకాల కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో ఎంపీడీవో తెలిపారు. 21న నగునూర్‌లో, బొమ్మకల్, మొగ్దుంపూర్, దుర్శేడ్ గ్రామాల్లో, 22న జూబ్లీనగర్, ఫకీర్‌ఖాన్‌పేట, చేగుర్తి, నల్లగుంటపల్లి, మందుల పల్లి, తహెర్ కొండాపూర్, గోపాల్‌పూర్, బహదూర్‌ఖాన్‌పేట, 23న ఎలబోతారం, చెర్లబూత్కూర్, ఇరుకుల్ల, చామనపల్లి, దుబ్బపల్లిలో గ్రామసభలు నిర్వహించనున్నారు.

● భగత్‌నగర్: ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం నేటి నుండి కొత్తపల్లి మండలంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ జె శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 21వతేదీ మంగళవారం మల్కాపూర్, బద్దిపల్లి, ఆసిఫ్‌నగర్, చింతకుంట గ్రామాల్లో, 22వ తేదీన నాగులమల్యాల, ఖాజీపూర్, కమాన్‌పూర్, ఎలగందల్ గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక చేపట్టనున్నట్లు తెలిపారు.

హుజూరాబాద్‌లో..

హుజూరాబాద్‌రూరల్: ఇందిరమ్మ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ కోసం అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు గ్రామాల వారీగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తూర్పాటి సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న కందుగుల, పోతిరెడ్డిపేట, వెంకట్రావ్‌పల్లె, పెద్దపాపయ్యపల్లి, సింగాపూర్, చెల్పూర్, శాలపల్లి-ఇందిరానగర్, 22న తుమ్మనపల్లి, సిర్సపల్లి, బొత్తలపల్లి, జూపాక, రాంపూర్, రంగాపూర్, కనుకులగిద్దె, 23న చిన్నపాపయ్యపల్లి, రాజపల్లి, కాట్రపల్లి, ధర్మరాజుపల్లిలో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు.

జమ్మికుంటలో..

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్‌తోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం నుంచి వార్డు, గ్రామ సభలు నిర్వహించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 30వార్డుల్లో ఈ నెల 21నుంచి 22వరకు, మండలంలోని 20గ్రామ పంచాయతీల్లో 21నుంచి 24వరకు గ్రామ సభలు ఏర్పాటు చేయనున్నారు.

వీణవంకలో..

వీణవంక: ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీధర్, తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సభల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

మానకొండూర్‌లో..

మానకొండూర్: మండలంలో 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వరలక్ష్మి సోమవారం తెలిపారు. ఈ నెల 21న లింగాపూర్, వేగురుపల్లి, కెల్లేడు, మద్దికుంట, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి, అన్నారం, దేవంపల్లి, 22న పచ్చునూర్, ఊటూర్, వెల్ది, మానకొండూర్, లలితాపూర్, రంగాపేట, కొండపల్కల, గంగిపల్లి గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న లక్ష్మీపూర్, శ్రీనివాస్‌నగర్, పోచంపల్లి, ఖాదర్‌గూడెం, ముంజంపల్లి, ఈదులగట్టెపల్లి, వన్నారం, జగ్గయ్యపల్లి, 24న రాఘవాపూర్, బంజేరుపల్లి, నిజాయితీగూడెం, పెద్దూరుపల్లి, శంషాబాద్ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



హుజూరాబాద్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

హుజూరాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న రాములుపై దాడి చేసిన వారిని శిక్షించాలని కోరుతూ సోమవారం హుజూరాబాద్ ఎంఆర్‌సీ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకుడు ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చక్రధర్, శ్రీనివాస్, వెంకటస్వామి, భాస్కర్, రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

● చొప్పదండి: రంగారెడ్డి జిల్లా మహేశ్వర మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబాల పల్లి రాములుపై దాడికి నిరసనగా అర్నకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

హుజూరాబాద్ రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హుజూరాబాద్ ఎంవీఐ కంచి వేణు సూచించారు. మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలోని ఏకశిల పాఠశాలలోని విద్యార్థులకు, స్కూల్ వ్యాన్ డ్రైవర్లు, క్లీనర్లుకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. స్కూల్ వ్యాన్‌లను తీసే సమయంలో బస్సు కండీషన్ చెక్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డు గుర్రం శ్రీకాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థిని ఇంటి వద్దకు వెళ్లి సూచనలు చేస్తున్న ఉపాధ్యాయ బృందం

సైదాపూర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆకునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొట్ల రామస్వామి తెలిపారు. విద్యార్థులకు ప్రతిరోజు ప్రత్యేక క్లాసులు తీసుకో వడంతో పాటు పాఠశాల సమయం తరువాత సాయంత్రం ఉపాధ్యాయ బృందం విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి విద్యార్థులు చదువుతున్నారా లేదా అని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుకునే వాతావరణం కల్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

వరిలో జింక్ లోపం

● ఏవో ముప్పిడి సూర్యనారాయణ



ఆంధ్రజ్యోతి: రబీ సాగులో రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఏవో: వరిలో జింక్ లోపం ఉంటుంది. దీని నివారణకు జింక్ స్ప్రే చేయాలి. మొగి పురుగు రాకుండా 4జీ గుళికలు వేయాలి. క్లోరోఫైరిఫాస్ పిచికారీ చేయాలి. మొక్కజొన్నలో మొగిపురుగు, కత్తెర పురుగు సోకకుండా క్వినాల్‌ఫాస్, అస్పేట్, పటేల్ లాంటివి స్ప్రే చేయాలి.

ఆంధ్రజ్యోతి: ఇల్లందకుంట మండలంలో సాగు విస్తీర్ణం ఎంత?

ఏవో: ఇల్లందకుంటలో సాగు విస్తీర్ణం 21,060 ఎకరాలు, రబీలో వరి 7వేలు, మొక్కజొన్న 8వేల ఎకరాల్లో సాగు చేశారు.

ఆంధ్రజ్యోతి: మండలంలో పామాయిల్ సాగు ఎలా ఉంది?

ఏవో: ప్రస్తుతం 40 ఎకరాల్లో సాగు ఉంది. పామాయిల్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఒక్కసారి వేసుకుంటే 30 ఏళ్ల వరకు ఆదాయం లభిస్తుంది.

● అవీ.. ఇవీ

కరీంనగర్ టౌన్: జిల్లాలోని అసైన్డ్ భూములు కలిగిన లావణి పట్టాదారులందరికి పీవోటీ యాక్టు 1977 చట్ట సవరణ చేసి పూర్తి యాజమాన్య హక్కులను కల్పించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దుర్గం మారుతి సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

సుభాష్‌నగర్: దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలని అభిమాని కళ్యాడపు ఆగయ్య సోమవారం కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టారు.

సుభాష్‌నగర్: సోషల్ వెల్ఫేర్ డీడీ నాగార్జునను దళిత నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. భగత్‌నగర్‌లోని అంబేద్కర్ భవన్ ప్రహరీ నిర్మాణం, భవనానికి సంబంధించిన భూమి ఆక్రమణకు గురైందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

భగత్‌నగర్: గ్రానైట్ పరిశ్రమకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సాయినగర్ సబ్‌స్టేషన్ ఖాజీపూర్-2లో విద్యుత్ అధికారులు 8ఎంవీ ఏపీటీఆర్‌ను అమర్చారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ పట్టణంలోని మురికి నీరు బొమ్మకల్ వాగులో కలవకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు సోమవారం కలెక్టర్‌కు విన్నవించారు. గ్రామంలో సీసీ రోడ్లు వేయాలని విన్నవించారు.

గణేశ్‌నగర్: కరీంనగర్ తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ బత్తుల గణేష్ బాబుకి డాక్టరేట్ లభించింది. 'ప్రిపరేషన్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ నానో స్ట్రక్చర్డ్ మిక్స్‌డ్ మెటల్ ఆక్సైడ్ క్యాటలిస్ట్ ఫర్ ఏరోబిక్ ఆక్సిడేషన్ ఆఫ్ ఆల్కహాల్స్ అండ్ కండెన్స్ ఆఫ్ ఆల్ డిహైడ్స్' అనే అంశంపై పరిశోధన నిర్వహించారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంతోపాటు, సిద్ధార్థ ప్రైవేటు పాఠశాలను ఎంఈవో రవీందర్ సోమవారం తనిఖీ చేశారు.

జమ్మికుంట: సీపీఎం రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్‌ను మండల కార్యదర్శి శీలం అశోక్ ఆధ్వర్యంలో జమ్మికుంటలో ఆవిష్కరించారు. సంగారెడ్డిలో 25నుంచి 28వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు.

హుజూరాబాద్: పట్టణంలోని మాడ మహేందర్ అనే నిరుపేద వైశ్యుడు ఇటీవల మృతి చెందగా, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక సూచనల మేరకు వారి కుటుంబానికి ఆర్యవైశ్యులు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. రూ. 1.18లక్షలు మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు.

శంకరపట్నం: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి ఏజెన్సీ ఆధ్వర్యంలో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు.

రామడుగు: సాధారణ ప్రసవాలను ప్రోత్సాహించాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. మండలంలోని గుండి గోపాల్‌రావుపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.

మానకొండూర్: మండలంలోని పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యుండింటి పద్మశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చొప్పదండి: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు పలువురు గ్రామస్థులు సీఎంకు వినతిపత్రం పంపించారు.

తిమ్మాపూర్: మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన గంగరపు సుమలత భర్త ఇటీవల మృతి చెందగా సుమలతతో కలిసి చదువుకున్న 2006-07 పదో తరగతి పూర్వ విద్యార్థులురూ.60 వేల సాయం అందించారు.

హుజూరాబాద్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాల మహానాడు నాయకులు పసుల రామ్మూర్తి, జూపాక సుధాకర్‌లపై సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

సైదాపూర్: జాగీర్‌పల్లిలో రైతు బండారి కుమారస్వామికి పోత్సాహకంగా డెయిరీ తరుపున రూ.3వేల విలువ చేసే పశువుల దానాను గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు ఆవుల అయిలయ్య అందించారు.

రామడుగు: మండలంలోని వెలిచాల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గాదె నర్సయ్య ఆధ్వర్యంలో అల్పాహార సామగ్రి పంపిణీ చేశారు. దొమ్మాటి శంకరయ్య, బూర్ల మల్లేశం, వెంకటరాములు అల్పాహార సామగ్రి, పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అందజేశారు.